సాక్షి చిత్తూరు

శుక్రవారం । 5 । మే । 2023



భారీ అగ్నిప్రమాదం

చిత్తూరు దర్గా సర్కిల్ ప్రాంతంలోని సోఫాల తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.

-8లో



ఆస్పత్రికి వెళ్లి వస్తూ మృత్యుఒడిలోకి..

కారు..బైక్‌ను ఢీకొనడంతో నాలుగేళ్ల బాలిక మృతి చెందింది. ఆస్పత్రి వెళ్లి వస్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది.

-8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	25
తిరుపతి	34	26
తిరుమల	28	21
గూడూరు	34	27
నగరి	34	26

న్యూస్‌రీల్

8 నుంచి గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో ఈనెల 8 నుంచి జూన్ 6 వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ మధుబాల తెలిపారు. 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు యోగ, ధ్యానం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, చెస్, కేరమ్స్, సంగీతం, నృత్యం.. తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణలో ప్రతిభ చాటిన వారికి ప్రతి వారం బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత గ్రంథాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పై అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి కలిగిన వారు చిత్తూరులో మిట్టూరులోని కేంద్ర గ్రంథాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

వేగంగా ఇంటి స్థలాలు సిద్ధం చేయండి

–జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



లేఅవుట్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో అనుప్పల్లె వద్ద జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూమిని చదును చేసే పనులు వారంలో పూర్తిచేసి ప్లాట్లు వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు నగరపాలక, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జేసీ, నగర కమిషనర్ అరుణ, చిత్తూరు ఆర్డీఓ రేణుక, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఇతర హౌసింగ్ అధికారులతో కలిసి అనుప్పల్లె లేఅవుట్‌ను పరిశీలించారు.శాశ్వత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ ఈఈ సుబ్రమణ్యం, డీఈ వెంకటరమణ, నగరపాలక డీఈ రమణ, ఏఈ శ్రీలత పాల్గొన్నారు.

కుప్పం.. కప్పం!



- కుప్పంకు చెందిన ఎంపీపీ స్థాయి టీడీపీ నాయకుడు.. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బాగానే సంపాదించాడు. అతని వద్దకు టీడీపీకి చెందిన ముఖ్యనాయకుడు ఒకరు ఇటీవల వెళ్లాడు. 'అన్నా మనం అధికారంలోకి రాబోతున్నాం.. నువ్వేమీ దిగులు పడొద్దు.. అధికారం వచ్చాక మండలంలో నువ్వే నాయకుడివి.. నిన్ను కాదని ఏ పనీ జరగదు. రాబోయే ఎన్నికల కోసం బాగా ఖర్చుచేయాల్సి వస్తుంది. రూ.25 లక్షలు పార్టీ ఫండ్‌గా ఇవ్వాలి. ఇది పై నుంచి ఆర్డర్. డబ్బులు త్వరగా సిద్ధం చేయండి' అని డిమాండ్ చేశారు.
- శాంతిపురం మండలానికి చెందిన మరో టీడీపీ నాయకుడి ఇంటికి వెళ్లిన ఆ ముఖ్యనేత.. 'పార్టీ కోసం మీరు బాగా పనిచేశారు. మిమ్మల్ని పార్టీ గుర్తించింది. 2024లో మనదే అధికారం. అధికారం వచ్చాక మండల బాధ్యతలన్నీ మీ చేతుల్లోనే ఉంటాయి. కాంట్రాక్టు పనులు, మైనింగ్ లీజులు.. బదిలీలు.. ఇతరత్రా అన్నీ మీ కనుసన్నల్లోనే నడుస్తాయి. వచ్చే ఎన్నికలకు మీరంతా సిద్ధంగా ఉండాలి. పార్టీ ఫండ్‌గా మీరు రూ.10 లక్షల వరకు ఇవ్వాలి. ఇది పై నుంచి వచ్చిన ఆదేశాలు. మీరు ఎప్పుడు రమ్మని చెబితే అప్పుడు నేనే వచ్చి తీసుకెళ్తా.'

.. ఇవీ కుప్పంలో తాజా పరిస్థితులు. టీడీపీ అధిష్టానం పెద్దలు చెప్పారంటూ.. ఓ ముఖ్యమైన నాయకుడు పార్టీ ఫండ్ పేరుతో వసూళ్లకు దిగుతున్నాడు. వివిధ వ్యాపారుల నుంచి లక్షల్లో వసూలు చేస్తున్నాడు. మరో వైపు కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి ఇప్పిస్తామంటూ.. స్థానిక టీడీపీ నాయకుల నుంచి కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఇదంతా చంద్రబాబు కనుసన్నల్లోనే జరుగుతోందని స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే కొందరి వద్ద రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. మైనింగ్ వ్యాపారులు, కర్ణాటకలో మద్యం వ్యాపారం చేస్తున్న వారు, భూస్వాములపై ఒత్తిడి చేసి మరీ గుంజుతున్నట్లు తెలుస్తోంది. ఎందుకివ్వాలని కొందరు ఎదురుతిరిగితే వారిని బెదిరింపులకు గురిచేయడం రివాజుగా మారుతోంది.

– సాక్షి, తిరుపతి

- దందా ప్రారంభించిన టీడీపీ
- త్వరలో అధికారం తమదే అంటూ బెదిరింపులు
- ఒక్కో వ్యాపారి రూ.25 లక్షలు ఇవ్వాల్సిందే అంటూ హుకుం
- మరో వైపు ఇన్‌చార్జి పదవి పేరిట పార్టీ నేత నుంచి వసూళ్లు
- ఫండ్ పేరుతో కార్యకర్తల నుంచి కూడా..

ఇన్‌చార్జ్ పదవి పేరుతో వసూళ్లు

కుప్పం పార్టీ శ్రేణుల మధ్య ఇన్‌చార్జ్ పదవి చిచ్చుపెట్టారు. పేరుకే ఇన్‌చార్జ్ అయినా పెత్తనం అంతా చంద్రబాబు పీఏ మనోహర్‌దే. ఆయనపై చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని, ఈసారి ఇన్‌చార్జ్ అయితే చక్రం తిప్పొచ్చని వారికి లేనిపోని ఆశలు కల్పించి పోటీపెట్టారు. కుప్పం ఇన్‌చార్జ్ పదవి కావాలంటే.. పార్టీకి ఫండ్ ఇవ్వాలంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. గతంలోనూ ఇలాగే ఇన్‌చార్జ్ మునిరత్నంని మారుస్తున్నామంటూ ప్రచారం చేసి ఆయన్నే కొనసాగించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న మునిత్నం స్థానంలో వేరొకరికి కట్టబెడుతారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపాలైన త్రిలోక్‌కి ఇన్‌చార్జ్ పదవిని కట్టబెట్టాలని స్థానిక టీడీపీ నేతల డిమాండ్. అయితే త్రిలోక్‌ని చంద్రబాబు పీఏ, ఇన్‌చార్జ్ వర్గీయులు విభేదిస్తున్నారు.

ఆ సామాజిక వర్గం వారికే ఇవ్వాలని..

ఇన్‌చార్జ్ పదవి కోసం ఒకరి మధ్య ఒకరికి పోటీ పెట్టి చివరకు అనుకున్న వ్యక్తినే నియమించడం చంద్రబాబు నైజం. ప్రధానంగా తన సామాజికవర్గం వారికే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీ కార్యాలయ ఇన్‌చార్జ్‌గా ఉన్న కాళ్లప్పనాయుడి పేరు వినిపిస్తోంది. ఇతనికి వయస్సు మీదపడుతుండడంతో వేరొకరి పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ని ప్రస్తుతానికి ఇన్‌చార్జ్ వ్యవహారాలు చూడమని బాబు ఆదేశించినట్లు సమాచారం. ఇతను కూడా తన సామాజిక వర్గం కావడంతోనే కందుకూరు నుంచి తీసుకొచ్చిపెట్టారని,త్వరలోనే ఇతనికే కుప్పం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం కూడా వినిపిస్తోంది. ఇది కుప్పం నేతల్లో తీవ్ర అసంతృప్తిని రాజేసింది.

మళ్లీ 'గజ గజ'



ఏనుగులు ధ్వంసం చేసిన అరటి, టమాట పంటలు

పలమనేరు: ఇన్నాళ్లూ పలమనేరు మండలంలోని అటవీ సమీప గ్రామాలకు పరిమితమైన ఏనుగులు మొరం పంచాయతీలోకి బుధవారం రాత్రి ప్రవేశించాయి. చెన్నుపల్లె, చిన్నపేట కురప్పల్లె, జల్లిపేట గ్రామాలకు చెందిన రాజ, విజయమ్మ, గణేష్, పార్వతమ్మ, శ్రీనివాసులుకు చెందిన అరటి, టమాట, మొక్కజొన్న, బొప్పాయి, వరి పంటలకు నష్టం కలిగించాయి. పంట నష్టాన్ని గురువారం స్థానిక అటవీశాఖ సిబ్బంది అంచనా వేశారు. ఈ ప్రాంతంలోకి ఏనుగులు గుంపు రావడంతో పొలాల వద్ద నివాసం ఉంటున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

సోమలలో..



సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ పత్రపల్లెలో ఏనుగులు పంటలపై బుధవారం రాత్రి దాడి చేశాయి. కృష్ణారెడ్డి, శివారెడ్డి, ఆనందరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులకు చెందిన వరి, టమాటా పంటలకు నష్టం కలిగించాయి.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

– సమీక్షలో జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : క్షేత్రస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని జేసీ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. కోర్టుల్లో నమోదైన భూ సమస్యల కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని, సంబంధిత రెవెన్యూ సమస్యలపై వెంటనే కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. పలు అభివృద్ధి పథకాలపై కోర్టులలో కేసులు నమోదై ఉన్నాయని, వాటికి సకాలంలో స్పందించి న్యాయస్థానాలకు ఇవ్వాల్సిన వివరణలను వెంటనే ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎస్‌ఆర్‌పురం తహసీల్దార్ లోకనాథపిళ్లై తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు 'జగనన్న విదేశీ విద్యాదీవెన'

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజనులు విదేశాలలో ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పిస్తోందన్నారు. విదేశాల్లో ఉన్న 200 ఉన్నత స్థాయి యూనివర్సిటీలలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు గిరిజన విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం పథకం అమలు చేస్తోందన్నారు. ఈ పథకానికి అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, వార్షికాదాయం రూ.8 లక్షలలోపు ఉండాలని, వయసు 35 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని చెప్పారు. వన్‌వే ఎకానమీ క్లాస్ టికెట్ మొత్తం, వీసా ఫీజు చెల్లిస్తుందన్నారు. ఆర్థిక సహాయాన్ని 4 విడతలలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే అర్హత ఉంటుందన్నారు. ఇతర వివరాలకు www.jnanabhumi.apcfss.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, రాష్ట్ర స్థాయి అధికారులు ఎంపిక చేస్తారని చెప్పారు.

అగ్రి గోల్డ్ భూములకు రక్షణేదీ?

పలమనేరు నియోజకవర్గంలో వీ.కోట మండలంలోని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అగ్రి గోల్డ్ భూములు, అందులోని వస్తువులు, చెట్లు మొదలైన వాటికి రక్షణ కరువైంది. రెవెన్యూ, అటవీశాఖ నిర్లక్ష్యం కారణంగా ఆక్రమణ, దోపిడీదారుల కన్ను పడింది. విలువైన టేకు చెట్లను నరికి తరలించడం, వస్తుసామగ్రి అదృశ్యం కావడం రక్షణ పరంగా అక్కడి డొల్లతనాన్ని చాటిచెబుతోంది.

- దర్జాగా టేకు చెట్ల నరికివేత
- కలపను సీజ్ చేసిన అటవీ అధికారులు
- వీ.కోట మండలంలోని అగ్రి గోల్డ్ భూములపై కబ్జాదారుల కన్ను





శివునికుప్పం వద్ద ప్రభుత్వ ఆధీనంలోని అగ్రిగోల్డ్ భూముల్లో నరికివేసిన టేకు వృక్షాలు

పలమనేరు : వీ.కోట మండలంలోని శివునికుప్పం వద్ద 5.40 ఎకరాల్లో గతంలో అగ్రిగోల్డ్ కంపెనీ పాల డెయిరీని నిర్వహించింది. 5.40 ఎకరాల స్థలంలోనే 2.3 ఎకరాల్లో 56 టేకు చెట్లను అప్పట్లో నాటింది. తర్వాత కాలంలో వాటాదారులకు కంపెనీ ఎగనామం పెట్టడంతో కోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని అన్ని అగ్రిగోల్డ్ భవనాలు, ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ పరంపరలో అక్కడి అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న టేకు చెట్లు విలువ లక్షలకు చేరింది. ఇప్పుడు ఆ చెట్ల వయసు 25 ఏళ్లు. టేకు చెట్టు మందం, పొడవు, కలప ఘనం ..ఇత్యాది వాటిని పరిగణనలోకి తీసుకుంటే ఒక్కో చెట్టు విలువ సగటున రూ.50వేల నుంచి రూ.60వేలని తెలియవచ్చింది. వాటిపై కొందరు కన్ను పడింది.

తాజాగా టేకు చెట్లు నరికివేత

నాలుగు రోజుల క్రితం పట్టపగలే కొందరు పది భారీ టేకు వృక్షాలను కోసి ట్రాక్టర్లలో తరలిస్తుండగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. అక్కడి తహసీల్దార్, డీఎఫ్‌ఓలకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. స్పందించిన కుప్పం రేంజి ననియాల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాబుప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లారు. సంబంధిత వీఆర్వో జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో అక్కడున్న టేకు వృక్షాలను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అలాగే చెట్లను విక్రయించిన కలప వ్యాపారి సుబ్రమణ్యం, వాటిని కొన్న కార్తీక్‌పై కుప్పం అటవీ శాఖ కేసు నమోదు చేసింది. ఉన్నతాధికారులకు నివేదిక పంపింది.

అగ్రిగోల్డ్ పాల డెయిరీలోనూ పరికరాలు మాయం!

ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అగ్రి గోల్డ్ పాల డెయిరీ, పక్కనే ఉన్న మామిడితోపు కూడా ఉంది. కొన్నేళ్లుగా వీటి భద్రత కరువైంది. ఈ నేపథ్యంలో ఏటా మామిడి ఫలసాయాన్ని కొంతరు తీసుకెళుతున్నట్టు స్థానికులు చెప్పారు. అలాగే, పాల డెయిరీలోని పలు సామగ్రి సైతం ఇప్పటికే అదృశ్యమై ఉండటం గమనార్హం!

భూముల ఆక్రమణకు స్కెచ్?

పాల డెయిరీలోని వస్తువులు మాయమై పరిశ్రమ శిథిలావస్థకు చేరింది. విలువైన ఆ భూములను ఎలాగైనా ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతో ఆ ప్రాంతానికి చెందిన కొందరు ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆధీనంలోని భవనాలు, వృక్షాలు, మామిడి తోపు రక్షణకు సంబంధిత శాఖలు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని అక్కడి స్థానికులు కోరుతున్నారు.

పకడ్బందీగా అభివృద్ధి పథకాల అమలు

- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్, జేసీలను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి కలెక్టర్, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను కలెక్టర్ వివరించారు. అలాగే, పర్యాటకరంగం అభివృద్ధికి ప్రాజెక్టుల ప్రక్రియ చేపడుతున్నామని, ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 4–జి మొబైల్ సేవల టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తిస్తున్నట్టు చెప్పారు. జగనన్న భూహక్కు భూ రక్షలో భాగంగా మొదటి విడత రీసర్వే పూర్తయిన గ్రామాలలో సర్వే రాళ్ల నాటిస్తున్నామని, ఈ నెల 10లోపు ఆ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్ చేయూత పథకం కింద లబ్ధి పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన పాడి పశువుల పెంపకం పై దృష్టి పెట్టామన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం



ఐరాల: మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నాగవాండ్లపల్లెలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి చెట్టులో మంటలు రేగాయి. చెట్టు కాలిపోవడాన్ని కొందరూ సెల్ కెమెరాలో చిత్రీకరించారు.

హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 68,953 మంది దర్శించుకోగా.. అందులో 30,579 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.2.92 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు రెండవ విడత వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా

– కలెక్టర్ షణ్మోహన్

సాక్షి, చిత్తూరు : వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా రెండవ విడత నగదును ఈ నెల 5న సీఎం జమ చేయనున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ గురువారం విలేకరులకు తెలిపారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సందేశాలు పంపామని, కార్యక్రమం పూర్తి కాగానే సంబంధిత పథకాలకు అర్హుల లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేస్తుందని కలెక్టర్ చెప్పారు

బార్డర్ చెక్‌పోస్టు తనిఖీ



బార్డర్ చెక్‌పోస్టులో పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌ఈబి అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి

గంగవరం:కర్ణాటక సరిహద్దులోని బార్డర్ చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, ఎస్‌ఈబీ ఏఈఎస్ ఆయేషాబేగం కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్ణాటకలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో సైతం ప్రత్యేక నిఘా ఉంచాలని గంగవరం పోలీసులను ఆదేశించారు. చెక్‌పోస్టు సిబ్బంది ఎప్పటికప్పుడు అలెర్ట్‌గా ఉండాలని, బెంగళూరు వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఆమె వెంట గంగవరం సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఈబి సీఐ రఘు ఉన్నారు.

కెనటిక్ గ్రీన్ షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


షోరూం అధినేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులో అంకుర హాస్పిటల్ ఎదురుగా విజన్ ఆటో మొబైల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కెనటిక్ గ్రీన్ ఎలక్ట్రికల్ టూవీలర్, త్రీ వీలర్ వెహికల్స్ షోరూంను గురువారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొల్యూషన్ తగ్గించే ఎలక్ట్రికల్ వెహికల్స్ వాడకం పెరగాలన్నారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ కాపిరెడ్డి జయచంద్రారెడ్డిని అభినందించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి షోరూం యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కాపిరెడ్డి రమేష్‌రెడ్డి, డాక్టర్లు హేమకుమార్‌రెడ్డి, హరిబాబు, కైనెటిక్ గ్రీన్ కంపెనీ రీజనల్ మేనేజర్ జమీర్, స్టేట్ హెడ్ జగన్, విజన్ ఆటో మొబైల్స్ సీఈఓ రమేష్, సీనియర్ మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఐటీ రంగంలో శిక్షణ

తిరుపతి అర్బన్ : ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్–టెక్ బీ ద్వారా ఐటీ రంగాలలో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్యాంమోహన్ తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో 2021–22 సంవత్సరంలో 60 శాతం, 2023 సంవత్సరంలో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. అభ్యర్థులు http://bit.y/techbee22 లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. 6వ తేదీ ఎయిర్‌బైపాస్ రోడ్డు, న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9గంటలకు హెచ్‌సీఎల్–టెక్ బీ ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని, స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9032697478, 7675827308, 8074919939, 9963859160 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సోఫాల తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం

- మంటలు ఆర్పేందుకు ఫైర్ ఇంజిన్లకు సరిపోని నీరు
- ఇతర ప్రాంతాల నుంచి మరో రెండు ఫైరింజన్ల రాక
- మంటలు ఆర్పేందుకు శ్రమలకోర్చిన వైనం
- వర్షం కురవడంతో అదుపులోకి వచ్చిన మంటలు


సోఫా తయారీ కేంద్రంలో చెలరేగుతున్న మంటలు


తయారీ కేంద్రం నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న ఆర్డీఓ రేణుక

చిత్తూరు కలెక్టరేట్ : సోఫా సెట్‌ల తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంఘటన గురువారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక దర్గాసర్కిల్ ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలు..ఇక్కడ నివాస గృహాల మధ్య దాదాపు ఏడాది కాలంగా రామ్‌నగర్ కాలనీ వాసి సాధిక్ స్థలం లీజుకు తీసుకుని సోఫా సెట్ల తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల వారంతా రంజాన్ పండుగ సెలవుపై ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఆ మార్గంలో వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ సర్వీసు డ్రైవర్ పొగలు వస్తూండడం గమనించి, బస్సు ఆపి, స్థానికులకు హెచ్చరించాడు. సమాచారం చేరవేయడంతో ఫైరింజన్ అక్కడికి చేరుకుంది. అప్పటికే భారీ ఎత్తున మంటలు ఎగసిపడుతుండడంతో లోనికి వెళ్లేందుకు వీలుకాక మంటలు ఆర్పలేకపోయారు. స్పాంజ్, ఇతర ముడిసరుకులు ఎక్కువగా ఉండడంతో మంటలు తీవ్రమయ్యాయి. జిల్లా కేంద్రంలోని రెండు ఫైరింజన్లతో మంటలను ఆర్పేందుకు శతవిధాలా యత్నించినా అదుపులోకి రాలేదు. మంటలు ఇళ్లవైపు వ్యాపిస్తూండడంతో స్థానికులు భయాందోళన చెందారు. వారు సైతం ఇళ్ల నుంచి బిందెలతో నీళ్లు తెచ్చి ఆర్పేందుకు యత్నించారు. ఆ తర్వాత ప్రైవేట్ ట్యాంక్ ను సైతం తీసుకొచ్చి మంటలను ఆర్పినా ఫలితం లేకపోయింది. అక్కడి వచ్చిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారంటూ వాగ్వాదం చేశారు. సోఫా సెట్ల కేంద్రం నిర్వాహకుడిని సాధిక్‌ను నిలదీశారు. చివరికి తిరుపతి, పలమనేరు నుంచి ఫైర్ ఇంజిన్లను తెచ్చి మంటలు ఆర్పసాగారు. ఇంతలో వర్షం మొదలైంది. అరగంట పాటు కురవడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. అప్పటికే సమయం సాయంత్రం 6 గంటలైంది.

పరిశీలించిన అధికారులు

ఘటన స్థలాన్ని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఆర్డీఓ రేణుక పరిశీలించారు. నిర్వాహకుడిని ప్రశ్నించారు. ఎలాంటి అనుమతి పొందకుండా నివాస గృహాల మధ్య ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అగ్ని ప్రమాదానికి కారణాలేమిటి? ఎంత ఆస్తినష్టం సంభవించిందనేది తేలాల్సి ఉంది. దీనిపై పూర్తి దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి తెలిపారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79

వరసిద్ధుని సేవలో ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్


గౌతంరెడ్డి కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి గురువారం తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కారు సహా ఎర్రదుంగలు స్వాధీనం


ఎర్రదుంగల నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్‌ఐ

–ఇద్దరి అరెస్ట్ గంగవరం: అక్రమంగా తరలిస్తున్న 4 ఎర్రచందనం దుంగలను కారుతో సహా పోలీసులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. గంగవరం సీఐ అశోక్‌కుమార్ కథనం.. చెన్నై–బెంగళూరు రహదారిలో మండలంలోని కుక్కలదొడ్డి క్రాస్ వద్ద గురువారం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, పోలీసు సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. బెంగళూరు వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా డిక్కీలో నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారులో ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. ప్రాథమిక విచారణలో సోమల మండలం నంజంపేటకు చెందిన షేక్‌షాకీర్ (29), ఇర్లపల్లెకు చెందిన వినోద్‌కుమార్(22) అని తేలింది. తలకోనలో ఎర్రచందనం చెట్లు నరికి, వాటిని దుంగలు చేసి, కర్ణాటకలోని మూలూరులో ఉంటున్న అక్రమ్‌కు వీటిని అక్రమ రవాణా చేస్తున్నట్టు వెల్లడైంది. కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. అక్రమ్‌ను త్వరలో పట్టుకుంటామని సీఐ చెప్పారు. కారుతో సహా ఎర్రచందనం దుంగల విలువ రూ.2.91లక్షలని, అలాగే షేక్‌షాకీర్‌పై భాకరాపేట, కాణిపాకం తదితర స్టేషన్లలో 4 కేసులు, వినోద్‌పై రెండు కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి


మృతి చెందిన ధనలక్ష్మి

పూతలపట్టు: చెరువులో పడి మతిస్థిమితం లేని ఓ మహిళ గురువారం మృతిచెందింది. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు.. పాకాల మండలం చెన్నుగారిపల్లెకు చెందిన సుబ్రమణ్యం భార్య బి.ధనలక్ష్మి(48) అనారోగ్యం బారిన పడి మతిస్థిమితం కోల్పోయింది. అప్పుడప్పుడూ తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో చింతమాకులపల్లెలోని తన పుట్టింటికి వెళ్లి వస్తానంటూ చెన్నుగారిపల్లె నుంచి గురువారం ఉదయం 7 గంటలకు బయల్దేరింది. అయితే ఆ గ్రామ దరిదాపుల్లోని చెరువులో ఆమె శవమై తేలింది. మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లిన కొందరు యువకులు చెరువులో మహిళ శవాన్ని చూసి వెలికితీశారు. మృతురాలిని ధనలక్ష్మిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సబ్‌జైల్ ఉద్యోగిని ఆత్మహత్య


ద్రాక్షాయణి (ఫైల్)

చిత్తూరు అర్బన్: మనస్తాపానికి గురై ఓ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌ఐ సీఐ నరసింహరాజు కథనం.. పెద్ద పంజాణి రాయల్‌పేటకు చెందిన ద్రాక్షాయణి(31)కి పదేళ్ల క్రితం వివాహమైంది. జైలు శాఖలో పనిచేస్తున్న ఆమె భర్త బాలాజీ 2014లో ప్రమాదవశాత్తు చనిపోవడంతో కారుణ్య నియామకం కింద ఆమెకు ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం చిత్తూరు జిల్లా జైలు శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె మిట్టూరులోని జైళ్ల శాఖ క్వార్టర్స్‌లో కాపురం ఉంటున్నారు. భర్త చనిపోవడం, తన తండ్రికి ఆరోగ్యం సరిగాలేకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో కుంగుబాటుకు గురై ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించింది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి 9 ఏళ్ల కుమార్తె ఉంది.

పోలీసు డ్రెస్‌తో దోపిడీ చేస్తున్న ముఠా అరెస్ట్


నిందితుల అరెస్టు చూపి, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

వి.కోట: సులభంగా డబ్బు సంపాదించేందుకు పోలీసు డ్రెస్‌లో వచ్చి మోసం చేస్తూ డబ్బులు దోచుకునే ఒక ముఠాను గురువారం వి.కోట పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గత నెల 28న వీ.కోట శ్రీనివాసపురానికి చెందిన రియాజ్‌ఖాన్ వద్దకు జమీర్‌బాషా(నిందితుల్లో ఒకడు) అనే వ్యక్తి వచ్చాడు. తనకు ఒక స్వామీజీ తెలుసునని, త్వరలోనే రూ.2వేల నోట్లు రద్దవుతాయని, స్వామి వద్ద 2 వేల నోట్లు కట్టలు కట్టలుగా ఉన్నాయని చెప్పాడు. రూ.2వేల నోట్లను మార్చుకుంటున్నాడని తెలిపారు. రూ.లక్ష విలువ చేసే 500 నోట్లు ఇస్తే బదులుగా రూ.2 వేల నోట్లు 1,20,000 వేలు ఇస్తారని నమ్మించారు. గత నెల 28న మండలంలోని అత్రిపల్లె క్రాస్ వద్దకు రూ.500 నోట్లు ఐదు లక్షలతో రియాజ్‌ఖాన్‌ను జమీర్‌బాషా తీసుకెళ్లాడు. ముందస్తు వ్యూహం ప్రకారం అక్కడికి శివన్న, డానియల్, ఇమ్రాన్ అనే వ్యక్తులు కారులో క్యాష్ మార్చిడికి వచ్చారు. ఇంతలో పోలీస్ డ్రెస్‌లో ఒక వ్యక్తి వచ్చి వారిని బెదిరించి, రియాజ్‌ఖాన్ నుంచి రూ.5 లక్షల క్యాష్‌ను బలవంతంగా తీసుకుని పారిపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ప్రసాద్ బాబు నేతృత్వంలో మండలంలో కేజీఎఫ్ రోడ్డులోని పత్రిపల్లె క్రాస్ వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో పోలీసులను చూసి పారిపోతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ప్రాథమిక విచారణలో కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన శివన్న (57), బెంగళూరుకు చెందిన డానియల్ (50,) ముళబాగల్‌కు చెందిన జమీర్‌బాషా (33,) కోలార్ జిల్లాకు చెందిన ఇమ్రాన్ (29), వెంకటేశయ్యశెట్టి(75) అని తేలింది. వీరే రియాజ్‌ఖాన్ నుంచి రూ.5లక్షలు తీసుకుని పారిపోయినట్లు వెల్లడైంది. వి.కోట, బంగారుపాళెం, పుంగనూరు, బంగారుపేట, ముళబాగల్‌లో ఇలా దోపిడీలకు వీరు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులపై పలు స్టేషన్లలో 10, 15 కేసుల వరకు నమోదైనట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించి, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తూంటే మృత్యుఒడిలోకి..

- బాలికతో సహా తల్లిదండ్రులకు తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ బాలిక మృతి


మృతి చెందిన బాలిక హేమబిందు (ఫైల్)

రొంపిచెర్ల: కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బాలిక మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని బండకిందపల్లె చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం.. ఎర్రావారిపాళ్యం మండలం చెరుకువారిపల్లె గ్రామ పంచాయతీ కోక్కువాండ్లపల్లెకు చెందిన దేరంగుల ఈశ్వరయ్య అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తె హేమబిందు(4)ను తన భార్య సులోచనతో కలిసి బుధవారం ద్విచక్ర వాహనంలో అన్నమయ్య జిల్లా పీలేరుకు వెళ్లి, వైద్యం చేయించి, తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా బండకిందపల్లె వద్ద ప్రమాదానికి గురయ్యారు. సోమల మండలం బి.చెరకువారిపల్లెకు చెందిన హరినాథరెడ్డి తన తల్లిదండ్రులకు తిరుపతిలో వైద్యపరీక్షలు చేయించి, కారులో స్వగ్రామానికి వెళుతూ మోటార్ సైకిల్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో హేమబిందుకు తీవ్ర గాయాలయ్యాయి. బాలిక తల్లిదండ్రులకు కాళ్లు విరిగాయి. పీలేరులో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి హేమబిందు మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి


మురుగేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

శాంతిపురం: కారు ఢీకొని మోటార్ సైక్లిస్టు దుర్మరణం చెందిన సంఘటన గురువారం సాయంత్రం కుప్పం–పలమనేరు జాతీయ రహదారిలోని కడపల్లె వద్ద చోటుచేసుకుంది. రాళ్లబూదుగూరు పోలీసుల కథనం..కడపల్లె పంచాయతీ పోడుచేన్లు గ్రామానికి చెందిన మురుగేష్(50) బైకుపై కుప్పం వైపు వెళ్తుండగా కడపల్లె వద్ద ఎదురుగా వచ్చిన కారు అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మురుగేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలంలో వారి రోదనలు చూపరులను విచలితుల్ని చేసింది.